ప్రాణం తీసిన భూ వివాదం!

- భూపాలపల్లిలో మాజీ కౌన్సిలర్ భర్త దారుణ హత్య
- భూ పంచాయతీలో జోక్యం చేసుకున్న రాజలింగమూర్తి
- రాజలింగమూర్తిపై పోలీసులకు ఫిర్యాదు.. ఆ తర్వాతే హత్య

రాజలింగమూర్తి(ఫైల్)

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) /భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లిలో వివాదాస్పదంగా మారిన ఓ స్థలం విషయంలో మాజీ కౌన్సిలర్ భర్త రాజలింగమూర్తి దారుణ హత్యకు గురయ్యారు. గతంలో పలువురు అధికారులను ఏసీబీకి పట్టించిన ఈయనపై పలువురు కక్ష పెంచుకోగా, తాజాగా స్థానిక పోలీస్‌స్టేషన్ ముందున్న భూమి పంచాయితీలో జోక్యం చేసుకోవడం, కొద్దిరోజులుగా గొడవలు జరుగుతుండడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుల దాకా వెళ్లింది. ఈ క్రమంలో రాజలింగమూర్తిపై ఓ వర్గం పోలీసులకు ఫిర్యాదు చేయడం, ఆ తర్వాతే ఈ హత్య జరగడం అనుమానాలకు తావిస్తోంది. వివరాల్లోకి వెళితే.. భూపాలపల్లి మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ నాగవెల్లి సరళ భర్త రాజలింగమూర్తి (48) బుధవారం రాత్రి 7:30 గంటల ప్రాంతంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం కార్యాలయం మీదుగా రెడ్డికాలనీ వైపు వెళ్తున్నారు. అక్కడ కాపుగాసిన గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడిచేశారు. స్థానికులు చేరుకునేలోగా దుండగులు పారిపోయారు. రాజలింగమూర్తిని జిల్లా దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడి బంధువులు దవాఖానకు చేరుకొని ఆందోళనకు దిగారు. కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, సీఐ నరేశ్ పరిస్థితిని పర్యవేక్షించారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దవాఖానకు చేరుకొని మృతుడి బంధువులను పరామర్శించారు. హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

హత్యపై అనుమానాలెన్నో..

రాజలింగమూర్తి హత్య ఘటన పై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో రాజలింగమూర్తి తహసీల్దార్ చక్రధర్, రేంజ్ ఆఫీసర్‌తో పాటు వీఆర్వోను ఏసీబీకి పట్టించాడు. అప్పటి నుంచి అతడిపై కక్ష సాధింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఇటీవల స్థానిక పోలీస్ స్టేషన్ ముందున్న రేణిగుంట్ల కుటుంబానికి సంబంధించిన భూమి వివాదాస్పదంగా మారింది. ఇందులో రాజలింగమూర్తి ప్రధాన పాత్ర పోషిస్తున్నాడని ఆ కుటుంబ సభ్యులు కక్ష పెంచుకున్నారు. 171 సర్వేనంబర్‌లోని అటవీ శాఖ భూమిలో సైతం రాజలింగమూర్తి తలదూర్చడంపై పలువురు గుర్రుగా ఉన్నారు. రాజలింగమూర్తి గతంలో మాజీ సర్పంచ్ బుర్ర చంద్రయ్యకు వ్యతిరేకంగా కేసు వేయడంతోపాటు మేడిగడ్డ ప్రాజెక్ట్ కుంగుబాటుపై కూడా కేసులు వేశాడు. రేణిగుంట్ల కుటుంబ సభ్యులపై సైతం భూముల విషయమై కేసులు వేయడంతో కోర్టులో కొనసాగుతున్నాయి. పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రేణిగుంట్ల కుటుంబ సభ్యుల భూమిలో రాజలింగమూర్తి జోక్యం చేసుకోవడంతో 15 రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. దీనిపై రేణిగుంట్ల కుటుంబ సభ్యులు డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారంలోగానే రాజలింగమూర్తి హత్యకు గురికావడం అనుమానాలకు తావిస్తున్నది. పోలీసులు సైతం రేణిగుంట్ల కుటుంబ సభ్యులు, రాజలింగమూర్తికి మధ్య జరిగిన తగాదాలే హత్యకు దారి తీసినట్టు అనుమానం వ్యక్తం చేస్తూ దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

రాజలింగమూర్తిపై 12 కేసులు

రాజలింగమూర్తిపై ఇప్పటికే పోలీసులు 12 కేసులు నమోదు చేశారు. సీసీ 1191 2023, సీసీ 793 2023, ఎస్‌టీసీ ఎన్ఐ 25 2023, సీసీ 4187 2022, సీసీ 3146 2022, సీసీ 5286 2022, సీసీ 2876 2022, ఎస్ 158, 2024, సీసీ 11 2024, ఎస్‌టీసీ ఎన్ఐ 49, 2024, ఓఎస్ 97 2024 కేస్ నంబర్లతో రాజలింగమూర్తిపై భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. రాజలింగమూర్తి వర్సెస్ రేణుకుంట్ల చంద్రయ్య, చెన్నబోయిన రాజు, స్టేట్ ఆఫ్ తెలంగాణ పై ఈ కేసులు నమోదయ్యాయి.

ప్రమాదపుటంచున శ్రీశైలం

సత్వరమే జోక్యం చేసుకోండి

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం రిజర్వాయర్ ప్రమాదపుటంచున ఉన్నదని, సత్వరమే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ ఈఎన్సీ అనిల్‌కుమార్ కోరారు. ఈ మేరకు ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్‌కు రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ కమిటీ చైర్మన్ హోదాలో ఈఎన్సీ అనిల్ కుమార్ తాజాగా లేఖ రాశారు. శ్రీశైలం డ్యామ్ స్పిల్‌వే దిగువన భారీ విస్తీర్ణంలో భారీ గొయ్యి ఏర్పడిందని, 2009లో వచ్చిన వరదలతో అది విస్తరించిందని వివరించారు.

ఉమ్మడి ఏపీతోనే తెలంగాణకు తీరని నష్టం

- కృష్ణా జలాల్లో తీవ్ర అన్యాయం
- బేసిన్ అవతలికి 323 టీఎంసీలు తరలింపు
- బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ ఏకరువు
- నేడూ వాదనల కొనసాగింపు

హైదరాబాద్, ఫిబ్రవరి19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు, రాష్ట్రాల సరిహద్దుల్లో వచ్చిన మార్పుల కారణంగా తెలంగాణ ప్రాంతానికి తీరని నష్టం వాటిల్లిందని, బేసిన్‌లోనే ఉన్నా కృష్ణా జలాలు దక్కకుండా పోయాయని తెలంగాణ వివరించింది. బేసిన్‌లోని రాష్ట్రాలు నీళ్ల కోసం అల్లాడుతుంటే, ఏపీ మాత్రం బేసిన్ అవతలికి 323 టీఎంసీలను మళ్లిస్తున్నదని, ఇది వాంఛనీయం కాదని తేల్చిచెప్పింది. ఈ మేరకు బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కు తెలంగాణ తరపు న్యాయవాదులు నివేదించారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సెక్షన్-3 మార్గదర్శకాల మేరకు ఇరు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పునఃపంపిణీకి సంబంధించి విచారణను బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ బుధవారం ప్రారంభించింది. కృష్ణా బేసిన్‌కు సంబంధించి చారిత్రక, భౌగోళిక అంశాలను ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ బ్రిజేశ్‌కుమార్, సభ్యులు జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ ఎస్ తలపాత్ర తెలుసుకున్నారు. తెలంగాణ సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ ఆయా అంశాలపై ట్రిబ్యునల్‌లో వాదనలను ప్రారంభించారు. కృష్ణా పరీవాహక ప్రాంతం, దాని ఉపవాగుల ప్రాధాన్యతలను వివరించారు. 1956లో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణతో రాష్ట్ర సరిహద్దుల్లో వచ్చిన మార్పులను మ్యాప్‌ల సహాయంతో వివరించారు. అదేవిధంగా తెలంగాణకు సంబంధించి ప్రస్తుతం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ల కింద ప్రతిపాదించిన నీరు, ఆయకట్టుకు వాస్తవానికి తుంగభద్ర డ్యామ్, కృష్ణా నదిపై అప్పర్ కృష్ణా ప్రాజెక్ట్ కాలువలు, భీమా ప్రాజెక్ట్‌ల ద్వారా గ్రావిటీ ద్వారా అందించేందుకు ప్రణాళికలను రూపొందించారని గుర్తుచేశారు. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సర్కార్ ఆ ప్రణాళికలను అమలు చేయలేదని, కేవలం నీరు, ఉపాధి, ఆర్థిక విషయాల్లో ఆంధ్ర ప్రాంతానికి అనుకూలంగా వ్యవహరించిందని వివరించారు. దీంతో తెలంగాణకు తీరని నష్టం వాటిల్లిందని తెలిపారు. తెలంగాణ ప్రాజెక్టులకు కేటాయించిన జలాలు అంతంత మాత్రమేనని వివరించారు.

80 లక్షల మందికి జీవనోపాధి

బేసిన్‌లోని తెలంగాణ ప్రాజెక్టులకు నికర జలాలను కేటాయిస్తే దాదాపు 25 లక్షల కుటుంబాలు, అంటే దాదాపు 80 లక్షల జనాభాకు జీవనోపాధి లభిస్తుందని సీఎస్ వైద్యనాథన్ వివరించారు. అంతర్రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ జల సూత్రాలను వివరించారు. ఏపీలో సాగులో ఉన్న వాస్తవ విస్తీర్ణాన్ని తగ్గించడం తమ ఉద్దేశం కాదని స్పష్టంచేశారు. శాస్త్రీయ పద్ధతులు, నీటిని సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా నీటిని పొదుపు చేయవచ్చని, ఆ పొదుపు జలాలను బేసిన్ ప్రాంతాలకు కేటాయించాలని తెలిపారు. అదేవిధంగా పోలవరం ద్వారా 80 టీఎంసీలు, పట్టిసీమ లిఫ్ట్ ద్వారా సుమారు 100 టీఎంసీలు, చింతలపూడి లిఫ్ట్ ద్వారా 27 టీఎంసీలను ఆంధ్రప్రదేశ్ బేసిన్ వెలుపలి ప్రాంతాలకు అందుబాటులో ఉన్నాయని వివరించారు. 75% డిపెండబిలిటీతో పెన్నా బేసిన్‌లో 98 టీఎంసీలు, గుండ్లకమ్మ సగటు డిపెండబిలిటీతో 195 టీఎంసీలు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఈ నేపథ్యంలో బేసిన్ నుంచి వెలుపలికి ఏపీ మళ్లించే జలాలను తెలంగాణకు కేటాయించాలని తెలంగాణ వాదనలు వినిపించింది. కృష్ణా డెల్టా వ్యవస్థ, నాగార్జునసాగర్ కమాండ్ ఏరియాల తగ్గింపు ఫలితంగా నీటి వినియోగం తగ్గుతుందని కూడా వివరించారు. కాలువ పడవాటి జలాల ద్వారా కృష్ణా డెల్టా వ్యవస్థలో 75 టీఎంసీల అదనపు నీరు ఏపీకి అందుబాటులో ఉంటుందని, దానిలో కొంత భాగాన్ని వినియోగించుకుంటున్నదని, దానిని లెక్కించాల్సిన అవసరముందన్నారు. కృష్ణా జలాల్లో దాదాపు 323 టీఎంసీలను ఏపీ బేసిన్ అవతలికి మళ్లిస్తున్నదని, బేసిన్ ప్రాంతాలు నీటి కోసం ఇబ్బంది పడుతున్నాయని వివరించారు. సరఫరా కంటే బేసిన్ డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పుడు, ఇష్టారాజ్యంగా నీటిని వినియోగించుకునేందుకు ఏపీని అనుమతించవద్దని వాదించారు. ట్రిబ్యునల్‌కు గణాంకాలను, మ్యాపులను తెలంగాణ న్యాయవాదులు సమర్పించారు. తెలంగాణ తరపున మోహన్‌కుమార్, సల్లా విజయ్‌కుమార్, వెంకటనారాయణ, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు. గురువారం కూడా ట్రిబ్యునల్ విచారణ కొనసాగనున్నది.

జెన్‌కో భాగస్వామ్యంతోనే రామగుండం ప్లాంట్

- ఆందోళనల నేపథ్యంలో వెనక్కి తగ్గిన సర్కారు
- హర్షం వ్యక్తంచేసిన పవర్ ఎంప్లాయీస్ జేఏసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : రామగుండంలో కొత్తగా నిర్మించే 800 మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్ నిర్మాణం విషయంలో సర్కారు వెనక్కితగ్గింది. విద్యుత్తు ఉద్యోగుల ఆందోళనలు, అభ్యంతరాల నేపథ్యంలో సింగరేణి భాగస్వామ్యంతో కాకుండా.. టీజీ జెన్‌కో భాగస్వామ్యంతోనే ఈ ప్లాంట్‌ను నిర్మించాలని నిర్ణయించింది. ఈ ప్లాంట్‌ను సింగరేణి, జెన్‌కో సంయుక్త భాగస్వామ్యంతో నిర్మిస్తామని గతంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించిన విషయం తెలిసిందే. విధివిధానాల ఖరారుకు రెండు సంస్థల అధికారులతో ఓ కమిటీని సైతం నియమించారు. సింగరేణి భాగస్వామ్యాన్ని విద్యుత్తు ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో టీజీజెన్‌కో ద్వారానే ఈ ప్లాంట్‌ను నిర్మించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ నేతలు బుధవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ప్రజాభవన్‌లో కలిసి హర్షం వ్యక్తంచేశారు. జెన్‌కో ద్వారానే నిర్మిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. 1999 నుంచి 2004 వరకు నియమితులైన ఉద్యోగులకు పాత పెన్షన్ వర్తింజేయాలని, పదోన్నతులు కల్పించాలని వినతిపత్రం అందజేశారు.

66:34 నిష్పత్తిలోనే నీటివాటాలు

- తెలంగాణకు చెప్పిన కేఆర్ఎంబీ
- ప్రస్తుతం అందుబాటులో ఉన్నదే 90 టీఎంసీలు
- ప్రాజెక్టుల వారీగా ఇండెంట్ సమర్పించాలని లేఖ
- 50:50 నిష్పత్తి డిమాండ్‌కు రాష్ట్ర సర్కారు తిలోదకాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి రిజర్వాయర్ల నుంచి 66:34 నిష్పత్తిలోనే నీటిని వినియోగించుకోవాలని ఇరు రాష్ట్రాలకు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు తేల్చిచెప్పింది. 50:50 నిష్పత్తిలో నీటిని వినియోగించుకుంటామని తెలంగాణ రాష్ట్రం చేసిన డిమాండ్‌ను కొట్టిపారేసింది. ఇరు రాష్ట్రాల ఈఎన్సీలకు తాజాగా లేఖ రాసింది. ప్రస్తుత నీటి సంవత్సరానికి సంబంధించి నీటి డిమాండ్లను పంపించాలని సూచించింది. గత నెల 21న నిర్వహించిన 19వ బోర్డు సమావేశంలో నీటివినియోగ వాటాలపై చర్చించారు. ట్రిబ్యునల్ అవార్డును ప్రకటించేవరకూ 50:50 నిష్పత్తిలో కృష్ణా జలాలను వినియోగించుకునేందుకు అవకాశమివ్వాలని తెలంగాణ డిమాండ్ చేసింది. అయితే 66:34 నిష్పత్తినే అమలుచేయాలని ఏపీ ప్రతిపాదించింది. ఏపీ ప్రతిపాదనకే కేఆర్ఎంబీ మొగ్గుచూపింది. అదే నిష్పత్తిలోనే నీటిని వినియోగించుకోవాలని తేల్చిచెప్పింది. సంవత్సరంలో మొత్తంగా 1,010.13 టీఎంసీలు వచ్చాయని వివరించింది. అందులో 66% అంటే 666.688 టీఎంసీలకుగాను ఏపీ ఇప్పటికే 639.652 టీఎంసీలను వినియోగించుకున్నదని, ప్రస్తుతం ఏపీ కోటాకు సంబంధించి 27.036 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని స్పష్టం చేసింది. తెలంగాణ కోటా 34% అంటే 343.446 టీఎంసీలకుగాను 211.691 టీఎంసీలను వినియోగించుకున్నదని, తెలంగాణ కోటాలో ఇంకా 131.755 టీఎంసీలు ఉన్నాయని వివరించింది. ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో 510 అడుగుల వరకు 63.603 టీఎంసీలు, శ్రీశైలం ప్రాజెక్టు ఎండీడీఎల్ 834 అడుగుల వద్ద 30.811 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయని బోర్డు వెల్లడించింది. కానీ సాగర్ ఎడమకాలువ ఆయకట్టుకు అదనంగా 18 టీఎంసీలు కావాలని ఏపీ, తెలంగాణ 116 టీఎంసీలు కావాలని ఇండెంట్లను సమర్పించాయని తెలిపింది. 21లోగా ఇండెంట్లు ఇవ్వాలని ఈఎన్సీలకు బోర్డు లేఖ రాసింది.

కాకతీయ కెనాల్ మరమ్మతులకు 1.80 కోట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి19 (నమస్తే తెలంగాణ): ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాల్వ అత్యవసర మరమ్మతుల కోసం 1.8 కోట్లను ప్రభుత్వం మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాకతీయ మెయిన్ కెనాల్ 311 కిలోమీటర్ల వద్ద అక్వడెక్ట్ మరమ్మతులకు ఈ నిధులను మంజూరు చేసింది.

16 వేల మెగావాట్లకు విద్యుత్తు డిమాండ్

నిరుటితో పోల్చితే గణనీయంగా పెరుగుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : యాసంగి సీజన్‌తోపాటు ఎండలు ముదురుతుండటంతో రాష్ట్రంలో విద్యుత్తుకు డిమాండ్ పెరుగుతున్నది. బుధవారం ఉదయం 7:55 గంటల సమయంలో 16,508 మెగావాట్ల రికార్డు వినియోగంగా నమోదైంది. ఈ నెల 10న 15,998 మెగావాట్లు నమోదవగా, బుధవారం 16 వేల మెగావాట్ల మైలురాయిని దాటింది. నిరుడు మార్చి 8న గరిష్ఠ డిమాండ్ 15,623 మెగావాట్లు ఉంటే, ఈ ఏడాది ఫిబ్రవరిలోనే 16 వేల మెగావాట్లకు చేరడం గమనార్హం. ఇందులో దక్షిణ డిస్కం పరిధిలో 10 వేల మెగావాట్లు నమోదైంది. రాష్ట్రంలో సగటు వినియోగం నిరుడు 267.23 మిలియన్ యూనిట్లు ఉండగా, ఈ ఏడాది 290 మిలియన్ యూనిట్లుగా నమోదైంది. దక్షిణ డిస్కం పరిధిలో నిరుడు సగటు వినియోగం 175.31 మిలియన్ యూనిట్లు కాగా, ఈ ఏడాది 194.63 మిలియన్ యూనిట్లుగా నమోదైంది. రాష్ట్రంలో సగటు వినియోగం 8.84 శాతం పెరగగా, విద్యుత్తు డిమాండ్ 9.63 శాతం పెరిగింది. విద్యుత్తు డిమాండ్‌ను డిస్కంలు దీటుగా ఎదుర్కొంటున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. డిమాండ్ మేరకు విద్యుత్తు సరఫరాకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.